గణపయ్యకు తుది మెరుగులు

- చవితి వేడుకలు సమీపించిన నేపథ్యంలో కళాకారులు బిజీ
- గొర్లివానిపాలెం కేంద్రంగా వివిధ ఆకృతుల్లో ప్రతిమల తయారీ

-7లో



బోగస్ పింఛన్ల ఏరివేతపై దృష్టి



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు అనర్హులకు పింఛన్లు

- స్థానికుల ఫిర్యాదుతో విచారణ చేపడుతున్న అధికారులు
- గొలుగొండ మండలంలో 21 మంది అనర్హుల తొలగింపు
- జిల్లాలో ఇంకా ఎంత మంది ఉన్నారనే దానిపై వివరాల సేకరణ
- అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా



అనకాపల్లిలో డీఆర్‌డీఏ కార్యాలయం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

బోగస్ పింఛన్లపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. అనర్హుల ఏరివేతకు కసరత్తు చేస్తోంది. అర్హులకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే గొలుగొండ మండలంలో 21 మంది అనర్హులు నకిలీ ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్నట్టు గుర్తించి జాబితా నుంచి వారి పేర్లను అధికారులు తొలగించారు. జిల్లాలో ఇంకా ఎంత మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నారనే దానిపై వివరాలు సేకరిస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు తమ అనుయాయులకు నకిలీ ధ్రువపత్రాలతో ఇబ్బడి ముబ్బడిగా పింఛన్లు మంజూరు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక గత జూలై, ఆగస్టు నెలల్లో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేసిన సమయంలో కొందరు అనర్హులను గుర్తించారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిపారు. దీనిపై విచారణ జరపాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందడంతో అటువంటి వారిని గుర్తించి పింఛన్ల జాబితా నుంచి తొలగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పేరుతో వయోవృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళ, గీత కార్మికులు, చేనేత కార్మికులు, వితంతువులు, హెచ్‌ఐవీ బాధితులు, డయాలసిస్, ఫైలేరియా వంటి 11 రకాల పింఛన్లు అందిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు నెలకు రూ.3 వేలు అందిస్తే, కూటమి ప్రభుత్వం నెలకు రూ.4 వేలు, దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు చొప్పున అందిస్తోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్ద సంఖ్యలో బోగస్ లబ్ధిదారులు నకిలీ పత్రాలను అందించి దివ్యాంగుల పింఛన్లు పొందుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. జిల్లాలో అధికారుల తాజా గణాంకాల ప్రకారం ప్రతి నెలా వివిధ కేటగిరీలకు చెందిన 2,62,624 మంది సామాజిక పింఛన్లు అందుకుంటున్నారు. వీరిలో 31,494 మంది దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారు. పింఛన్ల కోసం ప్రభుత్వం రూ.108.44 కోట్లు వరకు విడుదల చేస్తోంది.

స్థానికుల ఫిర్యాదుతో విచారణ

గొలుగొండ మండలం పాకలపాడు పంచాయతీలో మొత్తం 81 పింఛన్‌దారులు ఉండగా, అందులో 21 మంది అనర్హులు దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలు అందించి పింఛన్లు పొందుతున్నట్టు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు అనర్హులను గుర్తించి జాబితా నుంచి తొలగించారు. నాతవరం మండలంలో ఇద్దరు అనర్హులు భరోసా పింఛన్లు పొందుతున్నట్టు గుర్తించి తొలగించారు. అనర్హులైన పింఛన్‌దారులను గుర్తించి తొలగించేందుకు నోటీసులు జారీ చేస్తున్నారు.

ఫిర్యాదులు అందితే విచారణ

నకిలీ ధ్రువీకరణ పత్రాలు అందజేసి లబ్ధి పొందుతున్న పింఛన్‌దారుల వివరాలు సేకరిస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ శశీదేవి తెలిపారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు అందజేసి భరోసా పింఛన్లు పొందుతున్నట్టు అందిన ఫిర్యాదులపై విచారణ జరిపి గొలుగొండ మండలంలో 21 మంది పింఛన్లు తొలగించిన మాట వాస్తవమేనన్నారు. ఫిర్యాదులు అందితే గతంలో సమర్పించిన అర్హత ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. అన్ని అర్హతలు ఉన్న లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



తుమ్మపాలలో విధుల్లో ఉన్న గ్రామ సచివాలయ సిబ్బంది

సచివాలయ ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధం

ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన ప్రక్రియ

- 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం

అనకాపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీకి సర్వం సిద్ధమైంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రాతిపదికన ఈ బదిలీలు జరగనున్నాయి. ఈ నెల 15వ తేదీ వరకు ఉద్యోగుల బదిలీల కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో పలువురు సచివాలయ ఉద్యోగులు బదిలీల కోసం ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు చేసుకున్నారు. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లోనూ మ్యూచువల్, స్పౌజ్, మెడికల్, దివ్యాంగులు, వితంతువులకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ తేదీలను కలెక్టర్ త్వరలోనే ప్రకటించనున్నారు. జిల్లాలో 522 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా, వివిధ కేడర్లలో 3,723 మంది పని చేస్తున్నారు. వీరిలో 823 మంది బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఇప్పటికే వివరాలు అప్‌లోడ్ చేశారు. సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎం, వెటర్నరీ అసిస్టెంట్‌లు, వ్యవసాయ సహాయకు లకు బదిలీల నుంచి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. మిగిలిన వివిధ శాఖల ఉద్యోగులకు మాత్రమే బదిలీలు జరగనున్నాయి. 96 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులు 126 మంది, గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు 96 మంది, డిజిటల్ అసిస్టెంట్‌లు 124 మంది, సర్వేయర్లు 165 మంది, వీఆర్‌ఏలు 109 మంది, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు 107 మందికి బదిలీ అయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

-7లో

ఆనందపురం వద్ద ఢీకొన్న లారీలు

వానొస్తే మునకే

జగనన్న కాలనీని వీడని ముంపు కష్టాలు



తామర చెరువు సమీపంలో వరద నీటిలో ఉన్న జగనన్న కాలనీ

- ఈ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు వద్దని మొరపెట్టుకున్నా పట్టించుకోని గత వైసీపీ పాలకులు
- వర్షమొస్తే చెరువును తలపించేలా కాలనీ
- అసౌకర్యాల నడుమ కాలం గడుపుతున్న కాలనీవాసులను వేధిస్తున్న ముంపు సమస్య

చోడవరం, సెప్టెంబరు 3:

వానొస్తే ఆ కాలనీ ముంపునకు గురవుతుంది. కాలనీ వాసులు బయటకు వచ్చే అవకాశం కూడా లేకుండాపోతుంది. అసలే అసౌకర్యాల నడుమ కాలం గడుపుతున్న ఆ కాలనీ ప్రజలను ముంపు సమస్య వేధిస్తోంది... ఇదీ పట్టణంలోని జగనన్న కాలనీ దుస్థితి.

పట్టణంలోని తామర చెరువు సమీపంలోని పంపుహౌస్ వద్ద ఉన్న జగనన్న కాలనీలో ఇంకా వరద నీరు తగ్గలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా జలమయమైన ఈ కాలనీలో వర్షాలు తగ్గినప్పటికీ ఇంకా కాలనీలోని ఇళ్లు నీటి ముంపులోనే ఉన్నాయి. మంగళవారం నాటికి కూడా ఇంకా కాలనీలోని ఇళ్ల పరిసరాలలో నీరు ఇంకా నిల్వ ఉంది. వర్షాలు కొనసాగితే ఈ కాలనీ చెరువును తలపించేలా మారిపోవడం ఖాయంగా కనిపిస్తున్నది. బురద తగ్గితే తప్ప లబ్ధిదారులు ఇళ్లలో అడుగుపెట్టే పరిస్థితి కనిపించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లోతట్టుగా ఉన్న ఈ ప్రాంతంలో హడావిడిగా లేఅవుట్ వేసి ఇళ్ల స్థలాలు కేటాయించారు. అప్పట్లో ఈ ప్రాంతంలో కాలనీ ఏర్పాటు చేయవద్దని పలువురు పెద్దలు వారించినా లెక్క చేయకుండా నాటి ప్రజాప్రతినిధులు జగనన్న కాలనీకి స్థలాన్ని ఎంపిక చేశారు. కాలనీకి ఈ స్థలాన్ని ఎంపిక చేసిన తరువాత ఇల్లు కట్టకపోతే పట్టా రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేయడంతో చాలామంది అప్పులు చేసి నిర్మాణం ప్రారంభించారు. కాలనీలో నిర్మాణాలు ప్రారంభమైన తరువాత అంతర్గత రహదారులతో పాటు డ్రైనేజీ, లేఅవుట్ ఎత్తు చేసే పనిని చేపట్టాలని అప్పట్లో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే ప్రభుత్వం స్పందించలేదు. దీంతో కాలనీలో అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టలేదు. కొందరు లబ్ధిదారులు అరకొర సౌకర్యాల నడుమ ఇళ్లు పూర్తి చేసి అక్కడే ఉంటుండగా, మరి కొందరు ఇళ్ల నిర్మాణం పూర్తిచేసేందుకు పాట్లు పడుతున్నారు. ఈ కాలనీలోకి ఎగువ ప్రాంతం నుంచి కాలువ ద్వారా వరద నీరు వచ్చి ముంచెత్తుతోంది. దీని వల్ల కాలనీవాసులకు కష్టాలు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధులు స్పందించి తమ కాలనీ ముంపు కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.





రాంబిల్లి జంక్షన్‌లో గోతుల్లో నిలిచిన వర్షపు నీరు

నేవీ రోడ్డులో ప్రయాణమంటే హడల్

వెంకటాపురం జంక్షన్ నుంచి వాడనర్సాపురం వరకు అడుగడుగునా గోతులు

- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- వర్షం కురిస్తే సమస్య మరింత జటిలం



అప్పన్నపాలెం కాలనీ జంక్షన్ వద్ద ఛిద్రమైన రహదారి

రాంబిల్లి, సెప్టెంబరు 3: మండలంలో ప్రధాన రహదారి అయిన ప్రత్యామ్నాయ నేవల్ బేస్ (ఎన్ఏఓబీ) మార్గంలో పలుచోట్ల ఏర్పడిన గోతులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వర్షం కురిసినప్పుడు నీరు చేరి, గోతుల లోతును అంచనా వేయలేక వాహనచోదకులు ప్రమాదాలకు గురవు తున్నారు.

అచ్యుతాపురం- గాజువాక ప్రధాన రహదారిలో రాంబిల్లి మండలంలోని వెంకటాపురం జంక్షన్ నుంచి మండల కేంద్రం మీదుగా వాడనర్సాపురం వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర ప్రత్యామ్నాయ నేవల్ బేస్ రోడ్డు ఉంది. నేవల్ బేస్‌లో పలు రకాల నిర్మాణ పనులు జరుగుతుండడంతో నిరంతరం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తొలుత చిన్నపాటి గోతులు ఏర్పడగా... అధికారులు సకాలంలో నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో క్రమేపీ మరిన్ని గోతులు ఏర్పడి పెద్దవిగా మారాయి. దీంతో రాళ్లు తేలిపోయి రోడ్డుపై చిందరవందరగా పడుతున్నాయి. కొన్నిచోట్ల రోడ్డు మొత్తం గోతులమయంగా మారింది. ఈ మార్గంలో ఆర్టీసీ ఒకటీఅరా బస్సులు మాత్రమే నడుపుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలతోపాటు నేవల్ బేస్‌లో పనుల కోసం వెళ్లే కార్మికులు, ఉద్యోగులు ద్విచక్ర వాహనాలు, ఆటోలను ఆశ్రయించాల్సి వస్తున్నది. అడుగో గొయ్యి వుండడంతో ప్రయాణ సమయం రెట్టింపు కావడమేకాకుండా ఒళ్లుగుల్ల అవుతున్నదని వాహనచోదకులు వాపోతున్నారు.

గోవాడ షుగర్స్ సమావేశం వాయిదా

ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఆధ్వర్యంలో జరగాల్సిన భేటీ చివరి నిమిషంలో రద్దు

- ప్రజాప్రతినిధులకు వేరే కార్యక్రమాలు ఉండడమే కారణం



గోవాడ షుగర్ ఫ్యాక్టరీ

చోడవరం, సెప్టెంబరు 3: గోవాడ షుగర్స్ భవితవ్యంపై అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, కలెక్టర్, చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించవలసిన సమావేశం వాయిదా పడింది. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న గోవాడ షుగర్స్‌ను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేపట్టిన సంగతి తెలిసిందే. షుగర్ ఫ్యాక్టరీ మనుగడ కోసం అవసరమైన చర్యలు చేపడతామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో సమావేశం నిర్వహణకు ఇటీవల సిద్ధమయ్యారు. ఈలోగా జిల్లాలోని ఫార్మాకంపెనీలో చోటుచేసుకున్న భారీ ప్రమాదంతో ఈ సమావేశం వాయిదా పడింది. తాజాగా ఈ సమావేశం రెండు రోజుల్లోగా నిర్వహిస్తామని ఎంపీ ప్రకటించారు. ఎంపీ ప్రకటన మేరకు గోవాడ షుగర్స్‌పై మంగవారం సమావేశం ఉంటుందని భావించారు. కానీ ప్రజాప్రతినిధులకు చివరి నిమిషంలో వేరే కార్యక్రమాలు ఉండడంతో సమావేశం వాయిదా పడినట్టు అధికారవర్గాల సమాచారం.

ఇథనాల్ ప్లాంటా?..డిస్టిలరీనా?

గోవాడ షుగర్స్‌లో కేవలం పంచదార ఉత్పత్తి చేయడం వల్ల ఫ్యాక్టరీ దీర్ఘకాలంగా మనుగడ సాగించే అవకాశం లేదని నిర్ధారణ కావడంతో చాలాకాలంగా ప్రత్యామ్నాయం అమలు చేయాలన్న డిమాండ్ ఉంది. దీనిలో భాగంగానే ఇథనాల్ ప్లాంట్‌ను రూ.100 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్టు నాటి వైసీపీ ప్రభుత్వం హడావిడి చేసి నిధులు ఇచ్చినట్టు ఇచ్చి తిరిగి వెనక్కి తీసేసు కుంది. దీంతో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గోవాడలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబుతో పాటు ఎంపీ సీఎం రమేశ్ కూడా ప్రకటించారు. ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుతో గోవాడకు సుస్థిర ఆదాయం రావడంతో పాటు కార్మికులు, రైతులకు కూడా ఆర్థికంగా చేయూత లభించే అవకాశం ఉండడంతో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. కాగా గోవాడ లో ఇథనాల్ ప్లాంట్ కంటే డిస్టిలరీ ఏర్పాటు చేస్తే ఆర్థికంగా మరింత ఉపయోగమన్న సూచనను స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు గట్టిగా వినిపిస్తున్నారు. ఇథనాల్ ప్లాంట్ కంటే డిస్టిలరీ బాగుంటుందని, కార్మికులకు ఏడాది పొడవునా పని ఉంటుందని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గోవాడలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తారా?, లేక డిస్టిలరీ ఏర్పాటవుతుందా? అనేది ఫ్యాక్టరీ చైర్‌పర్సన్ కలెక్టర్‌తో పాటు ఎంపీ, చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేల సమావేశంలో ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అలాగే ఇథనాల్ ప్లాంట్ కానీ, డిస్టిలరీ కానీ ఏర్పాటుకు అవసరమైన నిధుల మంజూరుపైనా ఈ సమావేశంలో ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు.

వచ్చే క్రషింగ్ సీజన్‌పై చర్చించాలని..

ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ సమావేశంలో రానున్న క్రషింగ్ సీజన్‌కు అవసరమైన నిధులు సమకూర్చడంపైనా చర్చించే అవకాశం ఉన్నట్టు సమాచారం. రైతులకు ఇంకా సుమారుగా రూ.7 కోట్ల బకాయిలు చెల్లించవలసి ఉంది. ఫ్యాక్టరీ క్రషింగ్ సీజన్ ప్రారంభానికి ముందుగా చేపట్టే ఓవర్‌హాలింగ్ పనులకు కనీసం రూ.3 కోట్లు నుంచి రూ.5 కోట్లు వరకైనా నిధులు విడుదల చేయవలసిన అవసరం ఉంది. పూర్తిగా ఆర్థిక వనరులు అడుగంటిన పరిస్థితుల్లో ఓవర్‌హాలింగ్ పనులకు ప్రభుత్వం ఎంతోకొంత నిధులు విడుదల చేయకపోతే అడుగుముందుకు పడే పరిస్థితి లేనందున, నిధులు మంజూరు ప్రధాన అంశంగా ఉంది. ఇదే సమయంలో కార్మికులకు వేతన బకాయిలు కూడా పేరుకుపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో గోవాడను తిరిగి క్రషింగ్ దిశగా నడిపించి సీజన్ సజావుగా కొనసాగిస్తే ఫ్యాక్టరీకి పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉందని రైతులు, కార్మికులు భావిస్తున్నారు.

అనకాపల్లి రైల్వేస్టేషన్ వెలవెల

- రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు లేక బోసిపోయిన ప్లాట్‌ఫారాలు



అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో ఖాళీగా ఉన్న రెండో నంబరు ప్లాట్‌ఫారం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 3: నిత్యం ప్రయాణికులతో సందడిగా ఉండే అనకాపల్లి రైల్వేస్టేషన్ మంగళవారం బోసిపోయింది. భారీ వర్షాలకు విజయవాడ, పరిసర ప్రాంతాలు ముంపునకు గురికావడంతో దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు భారీ ఎత్తున రైళ్లను రద్దు చేయడంతో పాటు పలు రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నారు. అయితే అనకాపల్లి మీదుగా అటు ఒడిశా, పశ్చిమబెంగాల్, ఇటు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లే పలు రైళ్లు కూడా రద్దు కావడంతో అనకాపల్లి రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు ప్రయాణికులు లేక బోసిపోయాయి. హైదరాబాద్‌కు వెళ్లే గోదావరి, గరీబ్‌రథ్ రైళ్లతో పాటు విజయవాడ వెళ్లే రత్నాచల్, సింహాద్రి, రాయగడ- గుంటూరు రైళ్లు కూడా రద్దు జాబితాలో చేరుకోవడంతో ప్రయాణికులు ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. అయితే ప్రస్తుతం అనకాపల్లి జిల్లా వాసులకు రాజమండ్రి - విశాఖ, కాకినాడ పోర్టు - విశాఖ రైళ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

మహా విలీనం?

-7లో

- జీవీఎంసీలోకి భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలు
- మొత్తం 64 పంచాయతీలు...

విద్యా సమాఖ్య కేంద్రం మూత

30 మంది టీచర్లు వెనక్కి...

- రెండు రోజుల క్రితం ఆదేశాలు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో భీమిలి డైట్‌లో ఏర్పాటు
- సెంటర్ పనితీరుపై ఆది నుంచి విమర్శలు
- పట్టించుకోని గత పాలకులు
- ప్రభుత్వం మారడంతో మూసివేతకు నిర్ణయం
- త్వరలో మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు



భీమిలి డైట్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ ఆఫీస్

విశాఖపట్నం/భీమిలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భీమిలి డైట్ (డిస్ట్రిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్)లో రెండేళ్ల నుంచి నిర్వహిస్తున్న విద్యా సమాఖ్య కేంద్రాన్ని (కమాండ్ కంట్రోల్ సెంటర్) మూసివేయాల్సిందిగా పాఠశాల విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. అక్కడ పనిచేస్తున్న 30 మంది టీచర్లను గతంలో పనిచేసిన పాఠశాలలకు పంపించేశారు. వైసీపీ ప్రభుత్వం 2022 నవంబరులో భీమిలిలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుచేసి, అందులో పనిచేసేందుకు పలు జిల్లాల నుంచి 30 మంది టీచర్లను డిప్యూటేషన్‌పై నియమించింది. వారు ఇక్కడ నుంచి రాష్ట్ర స్థాయిలో పాఠశాల విద్యా శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలు, పాఠశాలలను పర్యవేక్షించాలని సూచించింది. ఒక్కొక్కరికీ ఒక్కో జిల్లా అప్పగించింది. పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేసిన తరువాత అప్‌లోడ్ చేసే ఫొటోలు, మధ్యాహ్న భోజనం ఫొటోలు, టీచర్ల అటెండెన్స్, ఇతరత్రా కార్యక్రమాలు అమలు తీరును ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని ఆదేశించింది. అయితే కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో 30 మందికి సరిపడా పని లేకపోయినా ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న వ్యక్తుల ద్వారా పలువురు టీచర్లు డిప్యూటేషన్ వేయించుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పనిచేయాల్సిన ఉపాధ్యాయులు

... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

గాయపడిన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మృతి

మాకవరపాలెం, సెప్టెంబరు 3: ఇటీవల జరిగిన కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చీపురుపల్లి దుర్గనాయుడు మృతి చెందినట్టు ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు. మండలంలోని వెంకన్నపాలెం గ్రామానికి చెందిన దుర్గనాయుడు హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో పండగ సందర్భంగా స్వగ్రామానికి రెండు రోజుల క్రితం వచ్చారు. ఆదివారం నర్సీపట్నం నుంచి కారులో వెంకన్నపాలెం వెళుతుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అతడిని విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఈయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎలమంచిలి, సెప్టెంబరు 3: పట్టణంలోని తులసీనగర్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడని పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తులసీనగర్‌కు చెందిన అలుగోలు రవిశంకర్(38) అప్పుల బాధతో సోమవారం ఇంట్లోనే పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతనిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. అతనికి తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నాని ఎస్ఐ తెలిపారు.

పెద్దేరులో వృద్ధుడి గల్లంతు

» మృతదేహం కోసం గాలింపు


వృద్ధుడి కోసం నదిలో గాలిస్తున్న ఈతగాళ్లు (ఇన్‌సెట్‌లో) గల్లంతైన నాగరాజు (ఫైల్)

చోడవరం, సెప్టెంబరు 3: మండలంలోని గౌరీపట్నం వద్ద పెద్దేరు నదిలో ఆకుల నాగరాజు (65) అనే వృద్ధుడు మంగళవారం మధ్యాహ్నం గల్లంతయ్యాడు. పొలాలకు వెళ్లేందుకు నదిలో దిగిన నాగరాజు ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయాడు. ఈ సమాచారం తెలియడంతో స్థానిక ఈతగాళ్లతోపాటు అగ్నిమాపక సిబ్బంది నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. నాగరాజుకు భార్య, కుమారుడు ఉన్నాడు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దేరు నదిలో ప్రవాహ ఉధృతి పెరిగింది. ఈ సమాచారం తెలియడంతో తహసీల్దార్ బి.తిరుమలబాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు మంగా జగన్నాథరావు, సర్పంచ్ కోన చంద్రరావు తదితరులు నది వద్ద ఉండి మృతదేహం కోసం గాలింపు చర్యలు పర్యవేక్షిస్తున్నారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

» ఇద్దరి అరెస్టు


సీజ్ చేసిన గంజాయి, కారుతో పోలీస్ అధికారులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 3: విశాఖ ఏజెన్సీ నుంచి ఢిల్లీకి గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని సోమవారం రాత్రి అరెస్టు చేసి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. నిందితులు గంజాయి రవాణాకు ఉపయోగించిన కారును, ఐదు సెల్‌ఫోన్లను, రూ. 250లు నగదును స్వాధీనం చేసుకున్నట్టు మంగళవారం తెలిపారు. సెంట్రల్ ఢిల్లీకి చెందిన మహ్మద్ ఫర్వేజ్ (19), ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అమేఠీకి చెందిన మహ్మద్ గుఫ్రాన్ (28)లు ఢిల్లీ నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ప్రాంతానికి వెళ్లి కారులో గంజాయితో వస్తుండగా పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణకు అందిన సమాచారం మేరకు తుమ్మపాల శివారు దాబా వద్ద సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో భాగంగా అనుమానం వచ్చిన కారును తనిఖీ చేయగా కారులో 25 కిలోల గంజాయి లభ్యమైందన్నారు. దీంతో ఇద్దరిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశామని సీఐ తెలిపారు. మంగళవారం నిందితులిద్దరిని కోర్టుకు హాజరుపరచిన అనంతరం రిమాండ్ తరలించామన్నారు.

భూవివాదంలో భార్యాభర్తలకు గాయాలు


గాయపడిన గొర్లె దేవుళ్లు, గొర్లె నారాయణమ్మ

కె.కోటపాడు, సెప్టెంబరు 3: భూవివాదంలో అన్న దమ్ములు కత్తులతో దాడి చేసుకోవడంతో భార్యా భర్తలకు గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఏ.కోడూరు ఎస్ఐ జె.రమేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కె.కోటపాడు రామయోగి అగ్రహారం గ్రామానికి చెందిన గొర్లె సన్యాసిరావు (అన్న), గొర్లె దేవుళ్లు (తమ్ముడు) మంగళవారం ఇంటి వద్ద భూవివాదంలో ఒకరినొకరు దూషించుకుంటూ కొట్లాటకు దిగారు. ఈ సందర్భంగా తమ్ముడు గొర్లె దేవుళ్లు, మరదలు నారాయణమ్మలపై అన్నయ్య సన్యాసినాయుడు కత్తితో దాడి చేశాడు. ఆ దాడిలో భార్యాభర్తలకు తలపై గాయాలయ్యాయి. వీరిద్దరిని కె.కోటపాడు 50 పడకల ఆసుపత్రికి తరలించగా.. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం గొర్లె దేవుళ్లకు మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించామని ఎస్ఐ జె.రమేష్ తెలిపారు. గొర్లె సన్యాసిరావును అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

» ఆనందపురం వద్ద ఢీకొన్న లారీలు

ఆనందపురం, సెప్టెంబరు 3: జాతీయ రహదారిపై విశాఖపట్నం జిల్లా ఆనందపురం వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఇందుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన కంటైనర్ లారీ డ్రైవర్ రాహుల్‌కుమార్ అలియాస్ భాస్కర్ (32) పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు నుంచి చేపల లోడుతో సోమవారం సాయంత్రం భువనేశ్వర్ బయలుదేరాడు. ఆనందపురం బ్రిడ్జిపైకి వచ్చేసరికి భాస్కర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కంటైనర్ లారీ అదుపుతప్పి డివైడర్ పైనుంచి అవతలి మార్గంలోకి వచ్చి...ఆ సమయంలో ఒడిశాలోని రాయగడ నుంచి అట్టల లోడుతో ఖమ్మం వెళుతున్న లారీని ఢీకొంది. ఈ క్రమంలో రెండు లారీలు బోల్తాపడ్డాయి. ప్రమాదంలో భాస్కర్‌తో పాటు అట్టల లోడు లారీ డ్రైవర్ రాయగడ జిల్లా జిమిడిపేటకు చెందిన వన్నల గౌరిశంకర్ (35) సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. చేపల లోడుతో వెళుతున్న లారీ క్లీనర్ ప్రదీప్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతిచెందాడు. ఆనందపురం ఎస్ఐ సంతోష్, ట్రాఫిక్ ఎస్ఐ పాపారావులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వన్నల గౌరీశంకర్‌కు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్టు తెలిసింది. భాస్కర్, ప్రధాన్‌ల కుటుంబ వివరాలు తెలియలేదు. కేసును సీఐ తిరుమలరావు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

గణపయ్యకు తుది మెరుగులు

» చవితి వేడుకలు సమీపించిన నేపథ్యంలో కళాకారులు బిజీ
» గొర్లివానిపాలెం కేంద్రంగా వివిధ ఆకృతుల్లో ప్రతిమల తయారీ


విక్రయానికి సిద్ధం చేసిన వివిధ ఆకృతుల్లో గల వినాయక ప్రతిమలు


ప్రతిమలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు

పరవాడ, సెప్టెంబరు 3: చవితి వేడుకలు సమీపించిన నేపథ్యంలో వినాయక ప్రతిమల తయారీ దాదాపుగా చివరి దశకు చేరుకుంది. కళాకారులు తుది మెరుగులు దిద్దే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని గొర్లివానిపాలెంలో ఏటా భారీ సంఖ్యలో ప్రతిమలు తయారు చేస్తుంటారు. ఇందుకు కావాల్సిన ముడిసరకులు హైదరాబాద్, రాజమహేంద్రవరం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి తీసుకు వస్తారు. ఇప్పటికే పలు మండలాల్లో చవితి ఉత్సవాలు నిర్వహించేవారు ఆర్డర్లు ఇచ్చి ప్రతిమలను తయారు చేయించుకుంటున్నారు. స్థానికంగా తయారు చేసిన ప్రతిమలు ఈ మండలంతో పాటు పెదగంట్యాడ, గాజువాక, అగనంపూడి, కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్, అచ్యుతాపురం, ఎన్టీపీసీ, వాడచీపురుపల్లి, ఫార్మాసిటీ, తంతడి తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తుంటారు. వీటి ధరలు రూ. 1500లు నుంచి రూ. 18వేలు వరకు ఉన్నాయి. రెండు అడుగుల ఎత్తు నుంచి 12 అడుగుల ఎత్తు వరకు గల ప్రతిమలు ఇక్కడ రూపుదిద్దుకుంటున్నాయి. ఈ సందర్భంగా విగ్రహాల తయారీదారుడు ఆర్.సాయి 'ఆంధ్రజ్యోతి' మాట్లాడుతూ గత 25 ఏళ్లగా ప్రతిమలను తయారు చేస్తున్నట్టు చెప్పారు. చవితి వేడుకలకు రెండు నెలలు ముందు నుంచే పనులు చేపడుతున్నామన్నారు. సుమారు పది మంది కూలీలను పెట్టుకుని ప్రతిమలను తయారు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 50శాతం ప్రతిమలను ఉత్సవాల నిర్వాహకులు బుక్ చేసుకున్నట్టు వెల్లడించారు.

ఈ-క్రాప్ నమోదు 50 శాతం కాలేదు

» జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు
» గడువును పెంచాలని ప్రభుత్వాన్ని కోరతా..


ఈ-క్రాప్ నమోదుపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాధికారి మోహన్‌రావు

రావికమతం, సెప్టెంబరు 3: జిల్లాలో ఈ-క్రాప్ నమోదు 50 శాతం కూడా పూర్తి కాలేదని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మంగళవారం ఈ-క్రాప్ నమోదు, ఈ-పంట నమోదులను గుడివాడ, రావికమతం, పి.పొన్నవోలు గ్రామాలలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో ఉద్యాన, వ్యవసాయ పంటలకు మూడు లక్షల ఎకరాలకు నెల 15వ తేదీలోగా ఈ-క్రాప్ నమోదు చేయాల్సి ఉందన్నారు. ఇంతవరకు జిల్లా వ్యాప్తంగా ఒక లక్షా 30 వేల ఎకరాలకు మాత్రమే ఈ-క్రాప్ చేశారన్నారు. ఇందుకు కారణం కొన్ని మండలాలలో వరి నాట్లు ఇంకా కొనసాగడంతోపాటు సిబ్బందికి ప్రతి నెలా పింఛన్లు పంపిణీ, ఇంటింట సర్వే, ఇతర పనులు అప్పగించడమేనన్నారు. దీనివల్లే ఈ-క్రాప్ నమోదు చేయలేకపోయినట్టుగా గుర్తించామన్నారు. ఈ-క్రాప్ నమోదుకు ఈనెలాఖరు వరకూ పెంచాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. ఇంతవరకూ ఈ-క్రాప్ నమోదులో దేవరాపల్లి,నాతవరం, ఎస్.రాయవరం, చోడవరం మండలాలు ముందంజలో ఉండగా.. అచ్యుతాపురం, రోలుగుంట వెనుకబడి ఉన్నాయన్నారుత. రావికమతం మండలంలో 9,225 ఎకరాలకుగాను ఇంతవరకు 6,416.80 ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు జరిగిందన్నారు. ఇంతవరకు వరి పైరు చీడ పీడలు ఆశించలేదని, ప్రస్తుతం ఆశాజనకంగానే ఉందన్నారు. అనంతరం రావికమతం వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పనితీరులో ఆలసత్వం వహించే సిబ్బందిని ఏ మాత్రం ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో రూప, సిబ్బంది పాల్గొన్నారు.

శారదా నదిలో ఒకరి మృతదేహం లభ్యం

రాంబిల్లి, ఆగస్టు 3: మండలంలోని నారాయణపురం శారదా నదిలో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు రాంబిల్లి సీఐ నర్సింగరావు తెలిపారు. అతను ఎలమంచిలి మండలం కట్టుపాలెం గ్రామానికి చెందిన రవాడ అప్పారావు(61)గా గుర్తించినట్టు సీఐ చెప్పారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఈ నెల 1న సాయంత్రం అప్పారావు గ్రామాన్ని ఆనుకొని ఉన్న శారదా నది కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ జారిపడి మునిగిపోయాడు. అప్పారావు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఈ నెల 2న అతని కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకలేదు. అయితే నారాయణపురం శారదా నదిలో అతని మృతదేహాన్ని మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పరిశీలించిన పోలీసులు అతని కుటుంబ సభ్యులకు వివరాలు అందజేశారు. వారు వచ్చిన తరువాత శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

భారీగా ఎస్ఐల బదిలీ

పాడేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాడేరు పోలీస్ డివిజన్ పరిధిలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్‌జెట్టి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రం పాడేరు ఎస్ఐగా చోడవరం నుంచి ఎ.సూర్యనారాయణను నియమించారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.పాపినాయుడు	యలమంచిలి టౌన్	డుంబ్రిగుడ
కె.సంతోశ్‌కుమార్	డుంబ్రిగుడ	వీఆర్, విశాఖపట్నం
ఎస్.షణ్ముఖరావు	కురుపాం	జి.మాడుగుల
ఎ.శ్రీనివాసరావు	జి.మాడుగుల	వీఆర్, విశాఖపట్నం
ఎల్.సురేశ్	రోలుగుంట	మంప(కొయ్యూరు)
జె.లోకేశ్‌కుమార్	మంప(కొయ్యూరు)	వీఆర్, విశాఖపట్నం
ఎ.సూర్యనారాయణ	చోడవరం	పాడేరు
జి.తేజేశ్వరరావు	అనకాపలి రూరల్	ముంచంగిపుట్టు
కె.రవీంద్ర	ముంచంగిపుట్టు	సీలేరు(జీకేవీధి)
జె.రామకృష్ణ	సీలేరు (జీకేవీధి)	డీసీఆర్‌బీ పాడేరు
కె.రమణ	వీఆర్, అనకాపల్లి	పెదబయలు
పి.మనోజ్‌కుమార్	పెదబయలు	వీఆర్, విశాఖపట్నం
జి.వీరబాబు	జామి (విజయనగరం)	స్పెషల్ బ్రాంచ్, పాడేరు

సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి : డీపీవో


సంపద కేంద్రంలో వానపాములు వదులుతున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 3: మండలంలో గల అన్ని గ్రామ పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులను డీపీవో ఆర్.శిరీషారాణి ఆదేశించారు. మండలంలోని పీఎల్ పురం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ నాగలక్ష్మితో కలిసి మంగళవారం సందర్శించి వానపాములను వదిలారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వల్ల గ్రామాలు పరిశుభ్రంగా తయారవ్వడమే కాకుండా పంచాయతీలకు వర్మీ కంపోస్టు అమ్మకాల ద్వారా ఆదాయం లభిస్తుందన్నారు. సత్యవరం, నామవరం, పెద రాంభద్రపురం తదితర పంచాయతీలను సందర్శించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు వైవీ.సత్యనారాయణ, ఆచారి, శ్రీధర్, రామగోవిందు పాల్గొన్నారు.

మహా విలీనం?

» జీవీఎంసీలోకి భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలు
» మొత్తం 64 పంచాయతీలు...
» క్యాంపు కార్యాలయంలో నాయకులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమావేశం
» నగర పాలక సంస్థలో కలిస్తే శరవేగంగా అభివృద్ధి చెందుతాయని వెల్లడి
» పదేళ్ల వరకూ ఇంటి పన్నులు పెంచకుండా చూస్తానని హామీ
» నాయకుల అంగీకారం


ఆనందపురం మండల ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చర్చలు

భీమునిపట్నం, సెప్టెంబరు 3: మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ)లో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలోని 64 పంచాయతీల విలీనం ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. ఇదే విషయమై మంగళవారం బీచ్‌రోడ్డులో గల తన క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు మూడు మండలాల ముఖ్య నాయకులతో వేర్వేరుగా సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీలో విలీనం కావడం వల్ల గ్రామీణ ప్రాంతాలు త్వరితగతిన అభివృద్ధి చెందడానికి అవకాశాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతాలన్నీ శరవేగంగా అభివృద్ధి సాధిస్తాయన్నారు. ఈ క్రమంలో పట్టణంలో గల మూడు ప్రధాన రహదారులను విస్తరిస్తామన్నారు. విలీనం తర్వాత ఈ ప్రాంత భూముల విలువ కూడా పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో పట్టణాలు, నగరాలకు ఆనుకుని ఉన్న గ్రామీణ ప్రాంతాలను ఆయా కార్పొరేషన్లలో విలీనం చేయాలన్నది తమ ప్రభుత్వ విధాన నిర్ణయమన్నారు. ఇది ఒక్క జీవీఎంసీకే పరిమితం కాదని అందరూ గుర్తించాలన్నారు. ఈ ప్రక్రియ సామరస్యంగా పూర్తికావాలన్నది తమ అభిమతమన్నారు. అందుకే స్థానిక నాయకుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత ప్రభుత్వం అధికారిక నిర్ణయం వెలువడుతుందని మునిసిపల్ మంత్రి పి.నారాయణ సూచించారన్నారు. కాగా జీవీఎంసీ విలీనమైతే ఇంటి పన్నులు పెరిగిపోతాయని, ఎన్ఆర్ఈజీఎస్ పథకం ఆగిపోతుందని, దానివల్ల ఉపాధి పనులు చేసుకుని బతుకుతున్న గ్రామీణ ప్రాంతాల వాసులు ఆర్థికంగా ఇబ్బందిపడతారని ఈ సందర్భంగా పలువురు ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలిసింది. అందుకు గంటా మాట్లాడుతూ విలీనమైన పదేళ్ల వరకూ ఇంటి పన్నులు పెరిగే అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటామని, ఉపాధి పథకంపై కూడా మాట్లాడతానని చెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో నాయకులంతా జీవీఎంసీలో విలీనానికి అంగీకారం తెలిపారు. ఆనందపురం మండలంలోని 26 పంచాయతీలు, పద్మనాభం మండలంలో 22, భీమిలి మండలంలో 16...మొత్తం 64 పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. ఈ సమావేశంలో భీమిలి మండల టీడీపీ నాయకులు దంతులూరి అప్పల నరసింహరాజు, గాడు వెంకటప్పడు, యరబాల అనిల్‌ప్రసాద్, శరగడ అప్పారావు, అల్లు చిన్నయ్య, ఆనందపురం మండలానికి చెందిన నాయకులు గంద్రెడ్డి స్వామినాయుడు, బీఆర్‌బీ నాయుడు, మహంతి శివాజీ, తాత్రాజు అప్పారావు, పద్మనాభం మండల నాయకులు కోరాడ రమణ, కళిరెడ్డి దామోదరరావు, కాళ్ల నగేష్‌కుమార్, దంతులూరి గోపిబాబు, రాచకొండ అప్పల నర్సింహమూర్తి, కురిమిన లీలావతి, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జనసేన నాయకులు శాకరి శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు కంటుభుక్త రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజు వేడుకలకు స్పీకర్ అయ్యన్న దూరం



నర్సీపట్నం, సెప్టెంబరు 3: తుఫాన్ కారణంగా రాష్ట్రం విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్న కారణంగా బుధవారం పుట్టిన రోజు వేడుకలకు దూరంగా ఉంటున్నట్టు స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంగళవారం ట్విట్టర్ ద్వారా ప్రజలకు సందేశం పంపారు. సెప్టెంబరు 4న అయ్యన్నపాత్రుడు పుట్టిన రోజు వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకుంటారు. పదవిలో ఉన్నా.. లేకపోయినా..వేలాదిగా ఆయన ఇంటికి తరలి వచ్చి శుభాకాంక్షలు తెలియజేస్తారు. ఈ ఏడాది తుఫాన్ కారణంగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం లేదని స్పీకర్ పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, అభిమానులు ఎటువంటి వేడుకలు జరపవద్దని సూచించారు. ఆ మొత్తాన్ని వరద బాధితుల కోసం వ్యయం చేయాలని పిలుపునిచ్చారు.

ఫార్మసీ క్లస్టర్ హెడ్‌గా రాజేశ్


కె.రాజేశ్

కొత్తూరు, సెప్టెంబరు 3: ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల క్లస్టర్ హెడ్‌గా తనను ఎన్నుకున్నట్టు కె.రాజేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం బొబ్బిలి భాస్కరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహి స్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

మిస్టర్ టీన్ ఇండియా అవార్డు గ్రహీతకు ఘన స్వాగతం


శానాపతి ఆదిత్యనాయుడును అభినందిస్తున్న గ్రామస్థులు

ఎలమంచిలి, సెప్టెంబరు 3: మిస్టర్ టీన్ ఇండియా అవార్డును కైవసం చేసుకున్న ఏటికొప్పాక గ్రామానికి చెందిన శానాపతి ఆదిత్యనాయుడికి మంగళవారం గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదిత్యనాయుడు మాట్లాడుతూ గత నెల 31న ఢిల్లీలో మిస్ అండ్ మిస్టర్ టీన్ ఇండియా పోటీలు జరిగాయని, ఇందులో తాను టైటిల్ గెలుచుకున్నట్టు చెప్పారు. జడ్పీటీసీ శానాపతి సంధ్యారాముల కుమారుడు ఆదిత్యనాయుడు ఈ ఘనత సాధించడం పట్ల గ్రామానికి చెందిన అన్నం వెంకట్రావు, కరణం రవి, చిట్టినాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం


కోటవురట్ల కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కోటవురట్ల, సెప్టెంబరు 3: విద్యార్థినులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ ప్రశాంతి సూచించారు. మంగళవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె కోటవురట్ల కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు రక్త పరీక్షలు చేశారు. వసతి గృహంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పౌష్టిహకారం తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమం డాక్టర్ సంతోశ్‌కుమార్, ఎంపీహెచ్‌వో గోవిందరావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ సరితాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మరికొన్ని రైళ్లు రద్దు

విశాఖపట్నం, సెప్టెంబరు 3: భారీ వర్షాలతో జత రేక్‌లు అందుబాటులో లేక 4న (బుధవారం) విశాఖ-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు కొన్ని రైళ్లను రద్దు చేశారు. 4న(బుధవారం) విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20708), విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833)), నాందేడు-విశాఖ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20812), పాండిచ్చేరి-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12868), సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్ ప్రెస్ (20707), సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20834) రద్దు చేశారు. కాగా, మూడు రోజులుగా రైళ్ల రద్దుతో ఒరిజినేటింగ్ స్టేషన్లలో జత రేక్‌లు నిలిచిపోవడంతో మంగళవారం (3న) విశాఖ-నాందేడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20811), నాందేడు-సంబల్‌పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్ (20810), చెన్నై సెంట్రల్-హౌరా మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12840), చెన్నై సెంట్రల్-విశాఖ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22870), హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ (12703), గుంటూరు-విశాఖ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22702), కడప/తిరుపతి-విశాఖ తిరుమల ఎక్స్‌ప్రెస్ (17487) రైళ్లను రద్దు చేయాల్సి వచ్చినట్టు ఆయన తెలిపారు.

ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు

» ఢిల్లీ నుంచి విశాఖ చేరిన తరువాత సమాచారం
» క్షుణ్ణంగా తనిఖీ చేసిన భద్రతా సిబ్బంది
» ప్రమాదం లేదని నిర్ధారణ

గోపాలపట్నం (విశాఖపట్నం), సెప్టెంబరు 3: ఢిల్లీ నుంచి విశాఖపట్నం వచ్చిన విమానానికి బాంబు బెదిరింపు కాల్ రావడంతో విమానాశ్రయంలో కలకలం రేగింది. విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...మంగళవారం సాయంత్రం 5.40 గంటలకు ఏఐ 471 (ఎయిర్ ఇండియా) విమానం ఢిల్లీ విమానాశ్రయం నుంచి విశాఖపట్నం బయలుదేరింది. విమానం బయలుదేరిన కొద్దిసేపటికే ఢిల్లీ విమానాశ్రయానికి ఓ ఆగంతకుడు ఫోన్ చేసి విమానంలో బాంబు ఉన్నట్టు చెప్పాడు. దీంతో అప్రమత్తమైన ఢిల్లీ విమానాశ్రయం అధికారులు విశాఖపట్నం విమానాశ్రయ అధికారులకు సమాచారం అందజేశారు. ఈ విమానం రాత్రి 8.05 గంటలకు విశాఖపట్నం చేరుకోగా... 8.19 గంటలకు ఢిల్లీ విమానాశ్రయ అధికారులు సమాచారం ఇచ్చారు. దీంతో విశాఖ విమానాశ్రయం అధికారులు భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రయాణికులను, లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం బయటకు పంపారు. ఆ తరువాత భద్రతా సిబ్బంది అధికారుల సూచనతో నిబంధనలను అనుసరించి విమానాన్ని తనిఖీ చేసి ఎటువంటి అపాయం లేదని నిర్ధారించుకున్న తరువాత తిరిగి ఢిల్లీ పంపించడానికి అనుమతించారు. ఈ క్రమంలో రాత్రి 8.55 గంటలకు విశాఖ నుంచి ఢిల్లీ బయలుదేరాల్సిన విమానం 11.45 గంటల వరకూ విశాఖ విమానాశ్రయంలో నిలిచిపోయింది. ఈ విమానం రాత్రి 12.30 గంటలకు బయలుదేరే అవకాశం ఉందని తెలిసింది. ఇదిలావుండగా బెదిరింపు కాల్‌పై ఢిల్లీ పోలీసులకు అక్కడి విమానాశ్రయ అధికారులు ఫిర్యాదు చేయడంతో ఆగంతకుడి గాలిస్తున్నట్టు తెలిసింది. కాగా ఇదే విమానంలో ఎంపీ పురందేశ్వరి ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్నారు.

గణేశ్ మండపాల ఏర్పాటుకు
అనుమతి తప్పనిసరి : సీఐ

పరవాడ, సెప్టెంబరు 3 : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే మండపాలకు ముందస్తుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. ఇందుకు అనుమతులకు సంబంధించిన దరఖాస్తులు ప్రతి రోజు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు. పంచాయతీ, అగ్నిమాపక, విద్యుత్ శాఖల నుంచి ముందుగా పొందిన అనుమతి పత్రాలతో పాటు అన్ని వివరాలు పొందుపరిచిన దరఖాస్తులను అందజేయాలన్నారు. మండపాల వద్ద కమిటీ సభ్యుల్లో ఒకరు తప్పనిసరిగా 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

'ఎంవీఆర్' ఆధ్వర్యంలో అన్నసమారాధన


అన్నదానం చేస్తున్న వేంకటేశ్వరరావు తదితరులు

అనకాపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా ఎంవీఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక నర్సింగరావుపేటలో మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రస్టీ, ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వేంకటేశ్వరరావు హాజరై పలువురికి అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎంవీఆర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కూన నాగరాజు, సింహాచలం, సత్యనారాయణరాజు, నాగేశ్వరరావు, ఎంవీఆర్ యువసేన సభ్యులు హాజరయ్యారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

రాంబిల్లి, సెప్టెంబరు 3 : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా మంగళవారం మండలంలోని మత్స్యకార గ్రామమైన కొత్తపట్నం జనసేన పార్టీ మండల నాయకుడు గబ్బర్‌సింగ్ ఆధ్వర్యంలో వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రతి కుటుంబానికి మొక్కలు పంపిణీ చేసి ఇంటి వద్ద నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ స్థానిక నేతలు, పలువురు గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ధార్మిక కమిటీల ఏర్పాటు అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

రాంబిల్లి, సెప్టెంబరు 3 : దేవాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించడానికి, ధర్మ పరిరక్షణ కోసం ప్రతి గ్రామంలోనూ గ్రామ ధార్మిక కమిటీలు ఏర్పాటు కావాలని సమరసతా సేవా ఫౌండేషన్ ఎలమంచిలి ఖండ ధర్మప్రచారకులు కొల్లి అప్పారావు పేర్కొన్నారు. మండల కేంద్రం రాంబిల్లిలోని పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఫౌండేషన్ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ దేవాలయం కేంద్రంగా ప్రతి వారం భజనలు, ప్రతి పౌర్ణమికి సామూహిక హారతి, ఏకాదశి నాడు నగర సంకీర్తన, ప్రతి రెండోవ శనివారం సత్సంగం కచ్చితంగా జరుగుతూ ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సంయోజకులు సూరాడ నూకరాజు, చింతకాయల గగన్ కుమార్, శేశెట్టి అప్పారావు, చక్రవర్తి, కారే రాముడు, గణేష్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

మైలపల్లి ప్రశాంత్, S/o. మైలపల్లి రమణ, అనకాపల్లి జిల్లా, రాంబిల్లి (మం), వెంకయ్యపాలెం గ్రామం, అను నేను వెంకయ్యపాలెం నుండి రాంబిల్లి వెళ్తుండగా నా పాస్‌పోర్టు (No. R9329859) పోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

7337223788



చక్కెర కర్మాగారాలు తెరిపించాలి

చెరకు రైతు సంఘం జిల్లా నేతల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు, అప్పలరాజు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 3 : అనకాపల్లి జిల్లాలో మూతపడిన మూడు చక్కెర కర్మాగారాలను తెరిపించాలని, గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరించాలని చెరకు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు అప్పారావు, అప్పలరాజు కోరారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులు, ప్రజలను మోసం చేయాలని చూస్తున్న ఎంపీ సీఎం రమేష్ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. గోవాడ ఫ్యాక్టరీని ఆధునీకరించి క్రషింగ్ సామర్థ్యం పెంచి మద్దతు ధర, ప్రోత్సాహక ధర పెంచి రైతులను ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయితే నేడు ఇథనాల తయారీ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలనే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఇలాంటి దుష్ట ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయరంగమే ప్రధానమని అందులో చెరకు, చక్కెర కర్మాగారాలే రైతాంగానికి ప్రధాన ఆధారమన్నారు. ఒకానొక సమయంలో లక్ష ఎకరాల్లో చెరకు సాగు చేసిన అనకాపల్లి జిల్లాలో ప్రస్తుతం 13వేల ఎకరాలకు చెరకు పంట చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల ముందు హామీ మేరకు తక్షణమే తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి రైతులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు నాయనబాబు, ఎస్వీ నాయుడు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులకు దూరం : ఎంఈవో నరేశ్

నక్కపల్లి, సెప్టెంబరు 3 : వసతిగృహాలు, గురుకులాల్లో చదువుకుంటున్న బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని ఎంఈవో కె.నరేశ్ సూచించారు. మంగళవారం నక్కపల్లి కేజీబీవీలో బాలికలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. నక్కపల్లి సీహెచ్‌సీ గైనకాలజిస్ట్ డాక్టర్ జయలక్ష్మి, గొడిచెర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుకన్య నేతృత్వంలో బాలికలకు పలు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ వైద్యాధికారులు చెప్పిన సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో సలీమా, సిబ్బంది ఆషా, సిబ్బంది, శిరీష, లక్ష్మి, భూలక్ష్మి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.


బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో నరేశ్, గైనకాలజిస్ట్ డాక్టర్ జయలక్ష్మి

సమగ్రంగా ఓటర్ల సర్వే : ఈఆర్వో మనోరమ

ఎలమంచిలి, సెప్టెంబరు 3 : ఓటర్ల జాబితాల్లో సవరణలకు చేపట్టే ఇంటింటా సర్వేను బీఎల్వోలు పక్కాగా నిర్వహించాలని ఎలమంచిలి నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి మనోరమ ఆదేశించారు. మంగళవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన బీఎల్వోలకు స్థానిక మునిసిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ సమ్మరీ రివిజన్)లో ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు వంటి అంశాలను పక్కాగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రభాకరరావు, బీఎల్వోలు పాల్గొన్నారు.


బీఎల్వోలకు సూచలిస్తున్న ఈఆర్వో మనోరమ

శారదానది ఘాట్ వద్ద మరమ్మతులు


ఘాట్ పరిశీలిస్తున్న నిమజ్జనోత్సవ కమిటీ ప్రతినిధులు

కొత్తూరు, సెప్టెంబరు 3 : వినాయక నిమజ్జనోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 7నుంచి జరగనున్న వినాయక నవరాత్రులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా శారద నది ఘాట్ వద్ద మరమ్మతు పనులు పూర్తి చేశారు. దీంతో వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి తదితర కమిటీ సభ్యులు శారదాఘాట్‌ను పరిశీలించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాలతో శారదాఘాట్‌ను ఉత్సవాలకు అనువుగా తీర్చిదిద్దారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొడ్డేడ నాగేశ్వరరావు, సోమశేఖర్ పట్నాయక్, పి.పరదేశి, తిప్పన అప్పారావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

దిమిలిలో పరదేశమ్మ పండగ



రాంబిల్లి, సెప్టెంబరు 3 : మండలంలోని దిమిలి గ్రామంలో మంగళవారం పరదేశమ్మ అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి పసుపుకుంకుమను నివేదించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మొక్కులను చెల్లించుకున్నారు. నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. అమ్మవారి పండుగ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పలు ఆధ్యాత్మిక భక్తికార్యక్రమాలు నిర్వహించారు.

మొక్కలు నాటిన 'కూటమి' నేతలు

మునగపాక, సెప్టెంబరు 3 : మండలంలో వాడ్రాపల్లిలో మంగళవారం కూటమి నేతలు మంగళవారం మొక్కలు నాటారు. సుమారు 350 కొబ్బరి, టేకు మొక్కలు పంపిణీ చేసి నాటించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నర్సింగరావు, టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకులు పరశురామ్, మల్ల శేష పాల్గొన్నారు.

అత్యాచార నిందితుల్ని శిక్షించాలి

పరవాడ, సెప్టెంబరు 3 : కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పీహెచ్‌సీ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు వెన్నెల లక్ష్మి, మణి, సన్యాసమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

పరవాడ, సెప్టెంబరు 3 : ఇటీవల మృతి చెందిన వెన్నెలపాలెం పంచాయతీ పరిధి హనుమాన్ కాలనీకి చెందిన బండారు పైడంనాయుడు కుటుంబానికి జనసేన నేతలు ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం రూ.పది వేలు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకుడు పంచకర్ల మణికంఠ, రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, నేతలు ఎలమంచిలి వెంకటరావు, చిన్నంనాయుడు, వెన్నెల సందీప్, మహేష్, అయ్యబాబు, బంధం శ్రీనివాస్, నానాజీ, గణేష్ పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ నాగేశ్వరరావు

నక్కపల్లి, సెప్టెంబరు 3 : మండలంలోని పెదతీనార్ల రెవెన్యూ పరిధిలో సుమారు 7 ఎకరాల భూముల ను అనధికారిక లే-అవుట్లుగా వేసి నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల అమ్మకాలు చేపడుతున్నారని తహసీల్దార్ అంబేడ్కర్‌కు పెదతీనార్ల ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన నలుగురు వ్యక్తులు ఈ అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ లే అవుట్లకు విద్యుత్, డ్రైన్లు, రహదారులకు సౌకర్యం లేకుండానే అమ్మకాలు సాగిస్తూ మోసానికి పాల్పడుతున్నారన్నారు. వీఎంఆర్డీఏ ఆమోదం, అనుమతులు కూడా లేవని, తక్షణమే ఈ అక్రమ లే అవుట్ల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోరారు.





పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి : ఎంపీడీవో

పాయకరావుపేట, సెప్టెంబరు 3 : వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రధానంగా దృష్టిసారించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ఎ.సాంబశివరావు ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రతతో వ్యాధులను అరికట్టవచ్చన్నారు. తాగునీటి వనరులను శుభ్రం చేయడంతో పాటు క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కార్యాలయ ఏవో వర్మతో పాటు పంచాయతీ కార్యదర్శులు వైవీ సత్యనారాయణ, నరేష్, రాజు పాల్గొన్నారు.


సిబ్బందికి సూచలిస్తున్న ఎంపీడీవో సాంబశివరావు

అందరి సహకారంతోనే వ్యాధుల నియంత్రణ సాధ్యం

సబ్బవరం, సెప్టెంబరు 3 : గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రజలు సహకరించాలని ఈవోపీఆర్డీ మహేశ్ పిలుపునిచ్చారు. మొగలిపురంలో సర్పంచ్ గండి అరుణతో పాటు మాంసం, చేపల దుకాణాలు, టిఫిన్ సెంటర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ.. దుకాణాదారులు తప్పనిసరిగా డస్ట్‌బిన్లు వినియోగించాలని, వ్యర్థాలను దూరంగా తరలించి తగలబెట్టాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని స్పష్టం చేశారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో కంపోస్టు ఎరువు తయారీకి వానపాములు విడిచి పెట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అంగటి నానాజీ, కార్యదర్శి సంతోషి, సాయి, రేష్మ, శివ, రోహిణి తదితరులు పాల్గొన్నారు.


సంపద కేంద్రంలో వానపాములు విడిచి పెడుతున్న సర్పంచ్ అరుణ, ఈవోపీఆర్డీ మహేశ్

'బల్లా'కు తెలుగు వెలుగు సాహితీ పురస్కారం



అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 3 : స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం తెలుగు వెలుగు సాహితీ వేదిక అందించే పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు సంస్థ నుంచి లేఖ అందింది. నాగభూషణం గత కొన్నేళ్లుగా సామాజిక సేవా రంగంలో చేస్తున్న కృషిని గుర్తించి సామాజిక సేవా విశిష్ట జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్టు వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ నెల 15న విజయవాడలో పురస్కారాన్ని అందజేయనున్నట్టు వెల్లడించారు.

సీఐని కలిసిన టీడీపీ నేతలు


సీఐ విజయ్‌కుమార్‌ను కలిసిన తెలుగుదేశం నేతలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 3 : అనకాపల్లి పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన టీవీ విజయ్‌కుమార్‌ను టీడీపీ 83వ డివిజన్ ఇన్‌చార్జి బొడ్డపుప్రసాద్, 82వ డివిజన్ ఇన్‌చార్జి పోలారపు త్రినాథ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొలిమేర ఆనంద్, ఎస్.భానుచందర్ పాల్గొన్నారు.

కనీస సదుపాయాలు లేకుండా ఉండేదెలా? : జగనన్న కాలనీ వాసుల నిరసన

కొత్తూరు, సెప్టెంబరు 3 : అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామ రెవెన్యూ సర్వే నంబరు 2-2లో ఉన్న జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలని నిర్వాసితులు మంగళవారం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. జగనన్న కాలనీలో సుమారు 200 మందికి ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించిందని తెలిపారు. నిరుపేదలైన వారంతా వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని లేకుంటే ఇంటి పట్టాలు రావని చెప్పడంతో నిర్మాణాలు అప్పులు చేసి మరీ చేపట్టామని తెలిపారు. కానీ అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించలేన్నారు. సొంతిల్లు ఉన్నప్పటికీ తాగు నీరు, వీధిలైట్లు, రోడ్లు లేకపోవడంతో రాలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక సతమతమవుతున్నామని బాధితులు వాపోతున్నారు. తక్షణమే కాలనీల్లో కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కశింకోట, సెప్టెంబరు 3 : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలపై మంగళవారం అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ తిరుపతిరావు మాట్లాడుతూ నేత్రదానం ఆవశ్యకతను వివరించారు. మనిషి మరణించిన తరువాత తన నేత్రాలను దానం చేయడం వల్ల మరొకరికి చూపు ప్రసాదించినవాడవుతారని పేర్కొన్నారు. అన్ని దానాల కన్నా నేత్రదానం ఎంతో గొప్పదని తెలిపారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆప్తాలిక్ అధికారి ప్రసాద్, సూపర్‌వైజర్ రామ్మూర్తి, సత్యవతి, విజయలక్ష్మి, ఫార్మసీ ఫణి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

ఎస్.రాయవరం : జాతీయ అంధత్వ నివారణ, దృష్టి లోప నివారణ కార్యక్రమాలను పురస్కరించుకొని మండలంలోని సర్వసిద్ధి, పెనుగొల్లు పీహెచ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్లు ఎస్‌ఎస్వీ శక్తిప్రియ, రాజేశ్వరి, రామ్‌నాయక్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మంగళవారం నేత్రదానంపై అవగాహన ర్యాలీ చేపట్టారు కల్పించారు. ఈ సందర్భంగా గొడిచర్ల పీహెచ్‌సీ పీఎంవోవో వెంకటరావు మాట్లాడుతూ నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు అందేలా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పీఎంవోవో వెంకటరావు తదితరులు

ముళ్ల పొదల్లో శిశువు మృతదేహం

పరవాడ, సెప్టెంబరు 3 : మండలంలోని వాడచీపురుపల్లి శివారులోని ముళ్ల పొదల్లో మగ శిశువు మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాడచీపురుపల్లి గ్రామ శివారు నుంచి తిక్కవానిపాలేనికి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ముళ్లపొదల్లోమగశిశువు మృతదేహం ఉందని మంగళవారం రాత్రి స్థానికుల నుంచి సమాచారం అందడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆరు నుంచి ఏడు నెలల లోపే శిశువు జన్మించి మృతి చెందడంతో గుర్తు తెలియని వ్యక్తులు ముళ్ల పొదల వద్ద విడిచిపెట్టి వెళ్లిపోయారు. దీంతో శిశువు మృతదేహంపై చీమలు చుట్టుముట్టాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. వీఆర్వో హేమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం

మునగపాక, సెప్టెంబరు 3 : పర్యావరణ హితానికి ప్రతి ఒక్కరూ మట్టితో రూపొందించిన వినాయక ప్రతిమలనే పూజించాలని స్పందించే హృదయం సేవా సంస్థ ప్రతినిధి తిమ్మరాజు తెలిపారు. మండలంలోని తిమ్మరాజుపేటలో మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేసి, అవగాహన ర్యాలీ నిర్వహించారు. మనవంతు పర్యావరణానికి ఇతోధికంగా కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కేవీ రమణ, శివ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ వితరణ

ఎస్.రాయవరం, సెప్టెంబరు 3 : మండలంలోని పేటసూదిపురంలో జన సైనికులంతా కలిసి స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు.

విద్యా సమాఖ్య కేంద్రం మూత

... 5వ పేజీ తరువాయి

విశాఖలో ఉండాలన్న ఉద్దేశంతో ఈ సెంటర్‌లో పోస్టింగ్ తెచ్చుకున్నారు. అలాగే నగర శివారులోని ఒక పాఠశాలలో ఒక టీచరు ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నారు. గత ఏడాది బదిలీల్లో సదరు టీచరు ఏజెన్సీకి బదిలీ కావల్సి ఉంది. బదిలీ తప్పించుకునేందుకు డిప్యూటేషన్‌పై కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెళ్లారు. ఇక కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరుపై చాలాకాలంగా ఫిర్యాదులు వచ్చినా విద్యా శాఖ అధికారులు పట్టించుకోలేదని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తుండేవి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గత పాలకులకు అస్మదీయులైన టీచర్లతో నిండిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను రెండు రోజుల క్రితం మూసివేశారు. అక్కడ పనిచేసే టీచర్లు సంబంధిత పాఠశాలల్లో చేరారని డీఈవో చంద్రకళ తెలిపారు. త్వరలో మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వం మాదిరిగా మినీ సెంటర్లలో టీచర్లను కాకుండా బోధనేతర సిబ్బందిని నియమించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

శిథిలావస్థలో కోడూరు వంతెన

మాడుగుల, సెప్టెంబరు 3 : అనకాపల్లి జిల్లా మాడుగుల నుంచి ఎం.కోడూరు వెళ్లే మార్గంలో ఉన్నవంతెన శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే పరిస్థితిలో ఉంది. కొద్దిపాటిగా కురిసిన వర్షానికి వంతెనపైకి నీరుచేరి నిల్వ ఉండటంతో పాటు బురదమయంగా మారుతోంది. ఏళ్ల కాలం కిందట నిర్మించిన ఈ వంతెన అడుగు భాగంలో గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. అంతేకాకుండా వంతెనపై రక్షణ గోడలు లేకపోవడంతో పాటు వంతెన కిందికి దిగడంతో పై భాగంలో కొద్ది పాటి వర్షానికి సైతం నీరు చేరి బురద మయంగా తయారవుతోంది. దీంతో వంతెనపై నుంచి వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో భారీగా కుదుపులకు గురై శబ్దం వస్తోంది.


మాడుగుల నుంచి ఎం.కోడూరు వెళ్లే మార్గంలో వంతెన

అలాగే వంతెనపై రక్షణగోడ లేకపోవడంతో వాహన దారులు ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా వాహనం అదుపుతప్పి వంతెన కింద పడిపోయే ప్రమాదం ఉంది. ఈ వంతెన దుస్థితి గుర్తించి ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వివరించామని, అయితే పట్టించుకునే వారే లేరని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన కూలి పోతే వంతెన అవతలి వైపు ఉన్న గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు పాడేరు ఏజెన్సీ గ్రామాల నుంచి మాడుగుల రావాల్సిన ప్రయాణికులు కూడా ఘాటురోడ్డు వీదుగా ఆరు కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా స్పందించి తక్షణమే వంతెన మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.


ఎం.కోడూరు వంతెనపై నిలిచిన వర్షం నీరు

నేడు రక్తదాన శిబిరం

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 3 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జన్మదిన సందర్భంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని గొలుగొండ మండల వ్యాప్తంగా ఉన్న నాయకులు, యువత అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయవలసిందిగా కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

మద్యం దుకాణం సిబ్బంది మొర

నర్సీపట్నం, సెప్టెంబరు 3 : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ చేశారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో జయరామ్‌కు వినతిపత్రం అందజేశారు. మద్యం దుకాణాలు ప్రైవేటీకరణ చేయడం వలన తమ ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను నిర్లక్ష్యం చేయవద్దన్నారు.

తగ్గిన వరద.. తాండవ స్పిల్‌వే గేట్లు మూసివేత

నాతవరం, సెప్టెంబరు 3 : వరద తగ్గడంతో తాండవ స్పిల్‌వే గేట్లను అధికారులు మంగళవారం మూసివేశారు. తాండవలో ప్రమాదస్థాయికి నీటినిల్వలు చేరుకోవడంతో శనివారం రాత్రి నుంచి అధికారులు 1200 క్యూసెక్కుల నీటిని స్పిల్‌వే గేట్లు రెండింటిని ఎత్తి తాండవనదికి మంగళవారం ఉదయం వరకు బయటకు విడుదల చేశారు. అయితే వరద తగ్గడంతో మంగళవారం నుంచి స్పిల్‌వే గేట్లను మూసివేశారు. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం తాండవలో 377.6 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. ఇన్‌ఫ్లో ద్వారా తాండవలోకి 400 క్యూసెక్కుల నీరు వస్తోందని అధికారులు వెల్లడించారు. అలాగే తాండవ కుడిఎడమ కాలువలకు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు.

దోమతెరలు పంపిణీ చేయరూ..

▸▸ 5వ షెడ్యూల్డ్ గ్రామాల గిరిజనులు వినతి

నాతవరం, సెప్టెంబరు 3 : నాతవరం మండలంలో అయిదో షెడ్యూల్డ్‌లో ఉన్న సరుగుడు సుందరకోట, రామన్నపాలెం కెవిశరభవరం, పీఎన్‌డీపాలెం తదితర గిరిజన గ్రామాలకు అధికారులు దోమతెరలు పంపిణీ చేయాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఈ గ్రామాల్లో దోమల బెడద ఎక్కువైందని దీంతో వైరల్ జ్వరాలు వస్తున్నట్లు వీరు చెప్తున్నారు. ఒకప్పుడు ఈ గిరిజన గ్రామాలకు పాడేరు ఐటీడీఏ అధికారులు దోమతెరలు పంపిణీ చేసేవారని గుర్తు చేస్తున్నారు. అయితే గత కొన్నేళ్ల నుంచి పంపిణీ చేయడం లేదని అంటున్నారు. 2017లో నాతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా గిరిజన గ్రామాలతో పాటు నాతవరం మండలంలో గిరిజనేతరులకు కూడా దోమతెరలు పంపిణీ చేశారని వీరు చెప్తున్నారు. ఇప్పుడు దోమ తెరలు ఇవ్వకపోవడంతో సీజనల్ వ్యాధులకు గురవుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

ఎస్‌ఐను మర్యాద పూర్వకంగా కలిసిన టీడీపీ నేతలు

మాకవరపాలెం, సెప్టెంబరు 3 : మాకవరపాలెం ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన దామోదర్‌నాయుడును టీడీపీమండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, సీనియర్ నాయకులు అల్లురామునాయుడు, జోగిపాత్రుడు, మాజీ వైస్ ఎంపీపీ గోవిందతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే వైసీపీ మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పెట్ల భద్రాచలంతో పాటు మరికొందరు ఎస్‌ఐకి అభినందనలు తెలిపారు. అలాగే బీజేపీ మండల అధ్యక్షుడు మర్రినాయుడు అధ్వర్యంలో ఎస్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతి భద్రతలు పరిరక్షణకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని ఆయన కోరారు.


ఎస్‌ఐ దామోదర్‌నాయుడును కలిసిన టీడీపీ నేతలు

బీఆర్ అంబేడ్కర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఎం.కోటేశ్వరరావు

గొలుగొండ సెప్టెంబరు 3 : మండల కేంద్రంలో గల బీఆర్ అంబేడ్కర్ కళాశాలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఎం.కోటేశ్వరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ పదవీ విరమణ చేయడంతో కోటేశ్వరరావుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఆక్రమణల తొలగింపుపై డీఎల్‌పీవో విచారణ

చోడవరం, సెప్టెంబరు 3: స్వయంభూ విఘ్నేశ్వరాలయం సమీపంలోని పంచాయతీ స్థలంలోని ఆక్రమణల తొలగింపుపై తలెత్తిన వివాదంపై డీఎల్‌పీవో ఎస్ఎస్ఎస్ఎన్.మూర్తి మంగళవారం విచారణ చేపట్టారు. తనకు పట్టా ఇచ్చినప్పటికీ తన ఇంటిని పంచాయతీ అధికారులు, పోలీసులు బలవంతంగా తొలగించారంటూ బాధితురాలు నాగలక్ష్మి జిల్లా కలెక్టర్‌కు, ఎంపీ సీఎం రమేష్‌కు ఫిర్యాదులు చేయడంతో పాటు పది రోజులుగా ఆందోళన చేస్తున్నది. రాజకీయ నాయకులు ఆమెకు సంఘీభావం ప్రకటించడంతో ఈ వ్యవహారం ముదిరింది. దీంతో కలెక్టర్ డీపీవో విచారణకు ఆదేశించారు. ఈ మేరకు డీఎల్‌పీవో మూర్తి మంగళవారం పంచాయతీలోని రికార్డులు పరిశీలించిన అనంతరం, ఘటనా స్థలానికి చేరుకుని బాధిత మహిళతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ విచారణలో డీఎల్‌పీవోతో పాటు ఈవోపీఆర్‌డీ బి.చైతన్య, ఈవో నారాయణరావు పాల్గొన్నారు.

పుణ్యాలను ప్రసాదించే దైవమే కృష్ణుడు

▸▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 3: కలియుగంలో కల్మషాల్ని హరించి, పుణ్యాలను ప్రసాదించే దైవమే కృష్ణుడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. మంగళవారం పెదమదీనలో కష్ణాష్టమి వేడుకల్లో భాగంగా కృష్ణుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ డి.ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ ఎంవివి.సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ నాయకులు వియ్యపు అప్పారావు, గోవింద, మరిడిబాబు తదితరులు పాల్గొన్నారు.

6న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా


చోడవరం, సెప్టెంబరు 3: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6న ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్‌కుమార్, కోఆర్డినేటర్ వి.అప్పలనాయుడు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో హెటిరోఫార్మా, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, జీఎల్ గ్రూప్ అసోసియేట్ కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. పది. ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరై జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9494791935 నంబరుకు సంప్రదించాలని కోరారు.

వరి పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

రోలుగుంట, సెప్టెంబరు 3: భారీ వర్షాలకు నీట మునిగిన వరి పంటలకు రైతులుతగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో విజయలక్ష్మి సూచించారు. పంటలను రక్షించుకోవడంలో రైతులు మెళకువలు పాటించాలన్నారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. నీరు బయటకు వెళ్లిన తర్వాత పంటకు పోషకాలు అందడం కోసం 20 కిలోల యూరియా, 20 కిలోల పోటాష్ వేసుకోవాలని సూచించారు.

మండల అభివృద్ధికి కృషి చేయండి

▸▸ ఎమ్మెల్యే బండారుకు టీడీపీ నాయకుల విన్నపం


ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తితో టీడీపీ మండల నాయకులు

దేవరాపల్లి, సెప్టెంబరు 3: మండలంలో సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తిని కలిసి సమస్యలు వివరించారు. ముందుగా గృహ నిర్మాణ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకున్నందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మండలాన్ని అభివృద్ధి పదంలో నడపాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, నాయకులు పాత్రునాయుడు, కరుణాకరరావు, ఎస్.గోవింద, పి.వెంకరమణ, జి.రవి కుమార్, దేముళ్లు, చంద్రరావు, గోవిందమ్మ, సత్తిబాబు పాల్గొన్నారు.

పశు బీమా పథకాన్ని వినియోగించుకోండి

మాడుగుల రూరల్, సెప్టెంబరు 3: పశు బీమా పథకాన్ని వినియోగించుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడీ చిట్టినాయుడు కోరారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన రైతులు తమ వాటా కింద 20 శాతం, కార్డు లేనివారు 50 శాతం ప్రీమియం చెల్లిస్తే సరిపోతుందన్నారు. పశువులకు మూడేళ్ల పాటు జీవాలకు 1, 2 లేదా మూడు సంవత్సరాల పాటు బీమా పథకం వర్తిస్తుందని ఆయన వివరించారు.

హోటళ్లలో అధికారుల తనిఖీలు

కె.కోటపాడు, సెప్టెంబరు 3: మండలంలోని భోజన, టిఫిన్ హోటళ్లను అధికారుల బృందం మంగళవారం తనిఖీలు చేశారు. ఎంపీడీవో ఎస్.అప్పలరాజు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌బాబు, ఐసీడీఎస్ సీడీపీవో మంగతాయారు ఉమ్మడిగా హోటళ్లను తనిఖీలు చేశారు. వంటలు చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ పదార్థాలను ఉంచవద్దని ఆదేశించారు. తరుచూ తనిఖీలు నిర్వహిస్తామని, ఎక్కడైనా నిల్వ పదార్థాలు ఉంటే హోటల్‌పై కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు. మాంసాహారాన్ని ఫ్రిజ్లో ఉంచినా కేసులు తప్పవని స్పష్టం చేశారు. అలాగే కె.కోటపాడులోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న కిచెన్ రూములు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులకు వేడి పదార్థాలను మాత్రమే అందించాలని, వారికి జ్వరాలు వస్తే వెంటనే ఆసుపత్రికి సమాచారం ఇవ్వాలని చెప్పారు. హోటళ్ల నిర్వహణలో లోపాలు ఉంటే ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

90 శాతం రాయితీపై గోకులం షెడ్లు

▸▸ పశు సంవర్ధక శాఖ ఏడీ పుష్ప

రావికమతం, సెప్టెంబరు 3: ఉపాధి హామీ పథకం అనుసంధానంతో పాడి రైతులకు 90 శాతం రాయితీపై గోకులం షెడ్లు మంజూరు చేస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు (ఏడీ) టి.పుష్ప తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ రావికమతం ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలో ఉన్న రావికమతం, రోలుగుంట మండలాలకు రాష్ట్ర ప్రభుత్వం 50 యూనిట్‌లు మంజూరు చేసిందన్నారు. వీటిలో ఒక్కొక్క మండలాలని 25 చొప్పున గోకులం షెడ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ రైతులకు మొదటి ప్రాధాన్యత ఉంటుదన్నారు. వీరు లేకుంటే బీసీ రైతులకు అవకాశం కల్పిస్తామని ఆమె చెప్పారు. మరిన్ని వివరాలకు ఆయా మండలాల పశు వైద్యులను సంప్రదించాలని ఏడి తెలిపారు. అలాగే తెల్ల రేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు 60 శాతం రాయితీ సంపూర్ణ దాణా, కిలో రూ.15.9 విలువైన దాణాను కేవలం రూ.6.5కే సరఫరా చేస్తామని ఏడీ తెలిపారు. ఈ దాణా వల్ల పశువుల్లో పాల దిగుబడితో పాటు వెన్న శాతం బాగా పెరుగుతుందని, ఇది రైతులకు ఎంతో లాభదాయకమని చెప్పారు. అలాగే ఒక్కొక్క రైతు ఐదు పశువుల వరకూ బీమా కట్టుకోవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు పశు వైద్యులు లేదా రైతు సవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

వైద్య విద్యార్థిపై హత్యాచారం చేసిన దుండగులను శిక్షించాలని ధర్నా

రావికమతం, సెప్టెంబరు 3: కోల్‌కతాలో వైద్య విద్యార్థిపై అత్యాచారం, హత్య చేసిన దుండగలను కఠినంగా శిక్షించాలని రావికమతం పీహెచ్‌సీ వద్ద భోజనం విరామంలో వైద్య సిబ్బంది ధర్నా చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.సత్యవతి, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ వైద్య విద్యార్థిని అత్యంత దారుణంగా, హించించి హత్య చేసిన దుండగలను శిక్షించాల్సిన బెంగాల్ ప్రభుత్వం కేసును పక్కతోవ పట్టించి నిందితులను కాపాడే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. పసిబిడ్డల నుంచి ముసలివారి వరకు మహిళలకు రక్షణ లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానం

దేవదాయ ధర్మదాయశాఖ

ఆర్.టి.సి.కాంప్లెక్స్ వద్ద, బలిఘట్టం, నర్సీపట్నం

టెండరు కమ్ బహిరంగ వేలం ప్రకటన

అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం మండలం, నర్సీపట్నం గ్రామములో వేంచేసియున్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ఈ క్రింది వివరించబడిన ఐటమునకు తేది 10-09-2024 మంగళవారం ఉదయం 11.00 గంటలకు టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.నెం.	వివరములు	కాలపరిమితి	ప్రథమ ధరావత్తు
1	శ్రీ అమ్మవార్కి భక్తులచే సమర్పించబడి వదిలివేసిన వస్త్రములు (అనగా చీరలు, రవిక గుడ్డలు) తీసుకొనే హక్కు కొరకు	తేది.01-09-2024 నుండి తేది. 31-08-2025 వరకు	రూ. 50,000/- లు

వేలంపాట షరతులు: 1) వేలంపాటలో పాల్గొనదలచిన వారు ప్రథమ ధరావత్తు రూ.50,000/-లు నగదు రూపంలోగాని మరియు ఏదైనా జాతీయ బ్యాంకు నందు కార్యనిర్వాహణాధికారి, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానం, నర్సీపట్నం గ్రామం, నర్సీపట్నం మండలం, అనకాపల్లి జిల్లా పేరున డి.డి. సమర్పించవలెను. 2) పాట ముగిసిన వెంటనే పాట సొమ్ము మొత్తం చెల్లించవలెను. 3) ఈ వేలంపాట హిందూ దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు మంజూరు ఉత్తర్వులకు లోబడి దేవాదాయశాఖ అధికారులు పర్యవేక్షణలో పై దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే జరుపబడుచున్నది. హిందూ మతమునకు చెందిన వారు మాత్రమే పాటలో పాల్గొనుటకు అర్హులు. 4) ఈ వేలం పాటలో పాల్గొనదలచిన వేలం పాటదారులు వారి యొక్క అడ్రస్ ప్రూఫ్ నిమిత్తం ఓటర్ ఐ.డి.కార్డు/రేషన్ కార్డు/ఆధార్‌కార్డు/పాన్ కార్డులలో ఏదైనా ఒక జెరాక్స్ కాపీ సమర్పించవలెను. 5) తేది.01-09-2024 నుండి 31-08-2025 వరకు ఒక సంవత్సరం కాలమునకు మాత్రమే అమ్మవారికి భక్తులచే సమర్పించబడి వదిలివేసిన వస్త్రములు అనగా చీరలు, జాకెట్ గుడ్డలు తీసుకొను పాట హక్కుకు మాత్రమే బహిరంగవేలంలో ఉంచబడినది. 6) వేలంపాట పాడుకున్న హెచ్చు పాటదారుడు రూ.2,00,000/-లు విలువైన సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించవలెను.

నర్సీపట్నం
తేది:31-08-2024

ఇట్లు : కార్యనిర్వహణాధికారి
శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం, నర్సీపట్నం